క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని 26 గ్రామాలకు చెందిన డ్వాక్రా లబ్ధిదారులకు శనివారం వైఎస్సార్ ఆసరా చెక్కులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేస్తామని వెలుగు ఏపీఎం రఘురామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పామర్రు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సమావేశానికి డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చిన సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోషక విలువలు గల ఆహారంపై అవగాహన


కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి పోషక విలువలు గల ఆహార ప్రాధాన్యతను గుర్తించాలని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీవో గజలక్ష్మి అన్నారు. కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషక విలువలు గల ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న ఆహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు వైఎస్సార్ సీపీ నాయకురాలు అరదాని శ్రీదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు పేరుకుపోయిన చెత్తను తరలించి, డ్రైన్లలో పూడికను తొలగించారు. పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. గ్రామ ప్రజలకు పారిశుధ్యం ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సమావేశాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కె.గంగవరం: పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలోని ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కోటిపల్లిలో శుక్రవారం ఓబీసీ మోర్చ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి బీసీ ఇంటికీ కరపత్రాలు, స్టిక్కర్లు, గోడపత్రికల ద్వారా ఇంటికి చేరే విధంగా కార్యకర్తలు, ఓబీసీ మోర్చ పదవులు ఉన్న నాయకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చొల్లంగి త్రినాథ్, నాయకులు అయినవిల్లి సత్తిబాబు, దూడల శంకరనారాయణ, సూరంపూడి సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖధికారి పి.షాలెంరాజు సూచించారు. మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని విద్యార్థులకు మెరుగైన విద్యను, పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. ఉపాధ్యాయులు బోధనలో మెళకువలు పాటించి సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నిర్వాహికులకు పలు సూచనలు చేశారు. తొలుత పాఠశాలకు చెందిన టీసీ రికార్డ్స్, జేవీకే రికార్డ్స్, ఉపాధ్యాయులకు చెందిన డైరీలు, రిజిస్టర్స్, హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్చెం సీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడి మృతి


సుబ్బరాజు (ఫైల్)

రామచంద్రపురం: ఏఐటీయూసీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, బీర్ ఫ్యాక్టర్ వర్కర్స్ యూనియన్ మాజీ కార్యదర్శి కాకర్లపూడి వెంకట సుబ్బారాజు (66) గురువారం గుండెపోటుతో కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఏఐటీయూసీ నాయకులు డాక్టర్ స్టాలిన్, రాము, ఆర్బోస్ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ, కౌన్సిలర్ కేతా శ్రీను, యూటీఎఫ్ నాయకులు ఈశ్వరరావు, బీర్‌ఫ్యాక్టర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.వరహాలరావు, తోట సూరిబాబు, వివిధ కార్మిక సంఘాల నాయకులు రామచంద్రపురంలోని సుబ్బరాజు ఇంటి వద్ద ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ధనమ్మా.. చిక్కిపోతున్నావేవమ్మా..

- తగ్గుతున్న మర్రి ఊడల విస్తీర్ణం
- మానవ తాకిడికి తగ్గుతున్న ఊడల వృద్ధి
- మొదళ్ల వద్ద వంటావార్పుతో సమస్య తీవ్రం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న పర్యాటకులు


మర్రి చెట్టు మొదలులో ఇటుకల పొయ్యి, బూడిద


బులుగుపోయిన మర్రి చెట్టు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో ధన ధాన్యాల కల్పవల్లిగా పేరొందిన ధనమ్మతల్లి ఆధ్యాత్మిక కేంద్రాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కేంద్రం ఉండడంతో పర్యాటక కేంద్రంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ధనమ్మ మర్రిని సందర్శిస్తుంటారు. ప్రతి ఆదివారం మర్రి ప్రాంతం సందడిగా ఉంటుంది. కార్తికమాసంలో రోజూ జాతరను తలపిస్తుంది. ఇంతటి ప్రాధాన్యం గల ధనమ్మ మర్రి ప్రాంతం చిన్నబోతోంది. ఆలయం చుట్టూ ఆవరించి ఉన్న మర్రి ఊడల విస్తీర్ణం రానురానూ తరిగిపోతుండడంతో పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు.

తరిగిపోతున్న మర్రి ఊడల విస్తీర్ణం...

ఆది నుంచి నేటి వరకూ ప్రైవేట్ ఏలుబడిలో ధనమ్మ మర్రి నిర్వహణ కొనసాగుతుంది. ఆది, మంగళ, బుధవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఏర్పాట్లు చేయడం, తగిన సదుపాయాలను కల్పించడంలో కృషి సమర్థవంతంగా కొనసాగుతోంది. అయితే కాలం చెల్లడంతో కొన్ని మర్రిచెట్లు బులుగు పోయే దశకు చేరుకున్నాయి. క్షేత్రం ఆవరణలో మానవ తాకిడి పెరగడంతో నేల గట్టిపడి మర్రి ఊడలు భూమిలోకి చొచ్చుకొని వెళ్ళే పరిస్థితులు సన్నగిల్లుతున్నాయి. దీనికితోడు దైవ క్షేత్రాన్ని దర్శించుకుంటున్న భక్తులు మర్రి ఊడల చెట్ల వద్ద నిప్పు రాజేసి వంట చేయడంతో చెట్టు మొదలు ప్రాంతంలోని బెరడు దెబ్బతింటోంది. ఈ పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగడంతో ఇప్పటికే మర్రి ఊడలు చాలా వరకూ తగ్గిపోయాయి. రెండున్నర ఎకరాల్లో మర్రి ఊడలతో దైవ క్షేత్రం గుబురుగా ఉండేదని పెద్దలు చెబుతున్నారు. అందుకే క్షేత్రాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారంటున్నారు. వంట వార్పు చేసుకునేందుకు దైవ క్షేత్రం దూరంగా వంట షెడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది మర్రి మొదళ్ల వద్ద నిప్పు పెడుతుండడంతో సమస్య తలెత్తుతుంది. ధనమ్మ మర్రి ప్రాధాన్యతను కాపాడుకునేందుకు మర్రి చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ధనమ్మ మర్రి ప్రాశస్త్యం ఇదీ...

తీవ్ర కరవు కాటకాలున్న రోజుల్లో సమీప గ్రామాల ప్రజలను ధనమ్మతల్లి ఆదుకోవడం, అమ్మవారి అక్కచెల్లెళ్లు మర్రి ఊడల నడుమ నడియాడారన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారు. సుమారు రెండున్నర ఎకరాల గోదావరి లంక భూమిలో అమ్మవారి క్షేత్రం వెలసింది. సమీపాన గలగల పారే గౌతమి గోదావరి, చుట్టూరా ఉద్యాన పంటల సాగు, లంక వాసుల జీవనగమనం ఇలా ధనమ్మ మర్రికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ప్రాంత కొత్త దంపతులు తొలిరోజు అమ్మవారిని దర్శించుకోవడం ఆచారం. లంక గ్రామాల ప్రజలు తమ ఉద్యాన పంటల దిగుబడి కాలంలో తొలి పండు, గింజ, కాయ, పుష్పం తదితర ఉత్పత్తిని అమ్మవారికి సమర్పించుకుంటారు. వ్యాపార రంగంలోకి ప్రవేశించిన వారు అమ్మ దర్శనాన్ని తీసుకొంటారు. మహిళలు కొనుక్కున్న బంగారు ఆభరణాన్ని అమ్మవారి మెడలో వేసి పూజలు చేసి తీసుకెళ్తుంటారు. బారసాల రోజున, పిల్లలకు పేర్లు పెట్టించుకునేందుకు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. సంతాన లేమిగల దంపతులు ఆలయ ప్రాంగణంలోని ఉయ్యాలను ఊపి, ముడుపులను మర్రి చెట్టుకు కట్టి సంతాన ప్రాప్తికై మొక్కుకుంటారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మండపేట: పట్టణంలోని శ్రీరామ క్షేత్రంలోని సీతారామచంద్రస్వామి వారి 6వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు, మల్లిపూడి వెంకటేశ్వరరావు, సాయిలక్ష్మి దంపతులు, మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి ఊంజల్ సేవ జరిగింది. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్టు గణేశ్వరరావు తెలిపారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో అయినవిల్లి శివానందప్రసాదశర్మ, పుల్లేటికుర్తి రాంబాబు, పొన్నూరు అనంత భరద్వాజ్, జీఎస్ భగవాన్, మెర్ల పుల్లయ్యచౌదరి, పసల కొండ, కొనగళ్ల సత్యనారాయణ, యాదగని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మండపేట: పట్టణంలోని మయూరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అర్తమూరుకు చెందిన సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, సుజాత దంపతులు శనివారం అన్నదానం చేశారు. తమ కుమార్తె గౌరికీర్తి జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో నిర్వహించి వృద్ధులకు స్వీట్లు పంచి అన్నదానం చేశారు. ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య), సత్య గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఆసరా లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కు అందజేత


డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: మహిళ సాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆయన వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. పట్టణంలోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు మూడో విడత రుణమాఫీ సాయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ తోట పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, పార్టీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రాష్ట్రనేత రెడ్డి రాజుబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రుణమాఫీ పేరిట మాజీ సీఎం చంద్రబాబు రైతులు, డ్వాక్రా మహిళలను నట్టేట ముంచారని విమర్శించారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన, పట్టాభిరామయ్య చౌదరి, పాపారాయుడు, రాజుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్ మొండి భవాని, ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి తదితరులు మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమ పాలన తెచ్చిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రతి మహిళా అండగా నిలవాలని కోరారు. అనంతరం పట్టణంలోని 919 సంఘాలకు రూ. 7.47 కోట్లు రుణమాఫీ సొమ్మును అందజేశారు.

అడ్డగోలుగా పేర్లు పెట్టుకోవడం కాదు

అభివృద్ధి అంటే నిబంధనలు తుంగలోకి తొక్కి ప్రభుత్వ భవనాలకు అడ్డగోలుగా తండ్రి పేర్లు పెట్టుకోవడం కాదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుపై ఎమ్మెల్సీ తోట మండిపడ్డారు. అభివృద్ధి అంటే తానేనని ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో ఎమ్మెల్సీ తోట ధీటుగా స్పందించారు. కలువపువ్వు సెంటర్‌లో మండపేటకు గుర్తుగా ఉన్న కలువపువ్వు బొమ్మను తొలగించి తన తండ్రి విగ్రహం పెట్టుకోవడమే ఆయన చేసిన అభివృద్ధి అని విమర్శించారు. నిరుపేద మహిళకు మంజూరైన రూ. రెండు లక్షల కాపు కార్పొరేషన్ సాయాన్ని కాజేసిన కౌన్సిలర్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల తన వెంట తిప్పుకోవడం వారి అక్రమాలకు నిదర్శనమన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, ఆలీఖాన్‌బాబా, మెప్మా టీఈ అనంతలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి

'ఆసరా' పంపిణీలో వక్తలు


అద్దంకివారిలంకలో మహిళలకు రుణ మాఫీ నమూనా చెక్ అందజేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: పొదుపు సంఘాల ప్రోత్సాహానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ అన్నారు. అద్దంకివారిలంకలో సర్పంచ్ నాతి గవరయ్య అధ్యక్షతన శుక్రవారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కుటుంబాల ఆర్థిక ప్రగతికి మహిళలు చొరవ చూపుతున్నారన్నారు. మహిళల ఆర్థిక శక్తిని మెరుగుపర్చేందుకు సంఘాల రుణాన్ని మాఫీ చేసినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వెలుగు ఇన్‌చార్జి ఏపీఎం అర్జున మాట్లాడుతూ అద్దంకివారిలంకకు చెందిన 48 సంఘాల్లోని 480 మంది మహిళలకు రూ.30,65,611 రుణమాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొత్తపల్లి సూర్యారావు, సచివాలయ కన్వీనర్లు సిద్ధాంతుల దొరబాబు, కొండమూరి నాని, చిటకన గంగాభవాని, మాజీ సర్పంచ్ గొల్లకోటి రామకృష్ణ, వందే చంద్రరావు పాల్గొన్నారు.

రేపు పలు గ్రామాల్లో 'ఆసరా' పంపిణీ

మండలంలోని నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట గ్రామాల మహిళా సంఘాల రుణమాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వల్లూరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరుగుతుందని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఎంపీడీఓ తెలిపారు.

ఆకట్టుకున్న పశువుల అందాలపోటీలు


అందాల పోటీల్లో బహుమతి పొందిన పశుపోషకుడికి మెమెంటో అందజేస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో శుక్రవారం గ్రామ స్థాయి పశువుల అందాల పోటీలు నిర్వహించారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ దాసి మీనాకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, పశుసంవర్ధక శాఖ ఆలమూరు సహాయకుడు డాక్టర్ వీఎల్ అనిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొత్తం 43 మేలు జాతి రకాల దూడలను ప్రదర్శనలో ఉంచారు. వల్లూరి వీర్రాజుకు చెందిన గిర్ జాతి ఆవు దూడ ప్రథమ స్థానంలోనూ, పరంశెట్టి నాగేశ్వరరావు పుంగనూరు ఆవు దూడ ద్వితీయ, చిట్టూరి సూర్యనారాయణ ముర్రా జాతి గేదె దూడ తృతీయ స్థానాల్లోను నిలిచాయి. వాటి పోషకులకు జ్ఞాపికలు, పాలక్యాన్లు, పశుపోషక ఆహారాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలమూరు, కపిలేశ్వరపురం పశుసంవర్ధక శాఖ వైద్యులు డా.ఇందుప్రియ, ఎం.వెంకటరమణ, వీవీ రమణమూర్తి, భానుప్రసాద్, సుభాష్‌చంద్ర, మాధవి, పశుసంవర్ధక శాఖ సహాయకులు గంజా రాజు, పంచాయతీ కార్యదర్శి తాతపూడి సుభాకర్, గ్రామంలోని పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థుల ఉచిత ప్రవేశాలు

కపిలేశ్వరపురం: పేద విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు ప్రైవేటు స్కూళ్లలో వారికి ఉచిత ప్రవేశాలు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలపై 2023–24 విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్లు తమ సంస్థల్లో 25 శాతం సీట్లు పేద, బలహీన వర్గాల విద్యార్థులకు కేటాయించాలన్నారు. ఇప్పటికే ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు తమ సంస్థలను పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని చెప్పారు. ఈ నెల 7 లోపు 5 నుంచి 6 ఏళ్ల వయసున్న పేద విద్యార్థులు 1వ తరగతిలో ఉచిత ప్రవేశం కోసం తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. భూమిలేని వ్యవసాయ కుటుంబాల విద్యార్థులు, దివ్యాంగులు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలు కోసం సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించాలని ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి సూచించారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా రాంబాబు


చాట్రాతి జానకిరాంబాబు

రాయవరం: భారతీయ జనతా పార్టీ మండపేట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా రాయవరం మండలం లొల్లకు చెందిన చాట్రాతి జానకి రాంబాబును నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి తనకు నియామకపత్రం అందినట్లు రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం లొల్ల సర్పంచ్ అయిన జానకిరాంబాబు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. 1987 నుంచి బీజేపీలో వివిధ హోదాల్లో పనిచేసిన తనను నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

కోటిపల్లిలో చైన్‌స్నాచింగ్..

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో సాధనాల వరలక్ష్మి మెడలో ఉన్న రెండు కాసుల బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరలక్ష్మి గురువారం రాత్రి కోటిపల్లి రేవు వద్ద గల ఏట్టుపై ఉండగా బండిపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. వెంటనే తేరుకున్న మహిళ స్థానికుల సహాయంతో కె.గంగవరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కె. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గొలుసు దొంగిలించి వ్యక్తులను గుర్తించామని వారిని పట్టుకుంటామని తెలిపారు.

పోస్టల్ ఫ్రాంచైజ్ అవుట్‌లెట్స్‌కు దరఖాస్తులు

రామచంద్రపురం: తపాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తపాల శాఖ పోస్టల్ ఫ్రాంచైజ్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేస్తుందని వీటి కోసం అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాజమహేంద్రవరం డివిజినల్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం తపాల స్టాంపులు, కవర్లు అమ్మడం, రిజిస్టర్, స్పీడ్‌పోస్టు, మనియార్డర్‌లు బుక్ చేయటం వంటి సేవలను ఈ ఫ్రాంచైజ్ ద్వారా అందుబాటులోకి తీసుకురావటం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు పైబడిన ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తపాల శాఖకు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ జమ చేయాల్సి ఉంటుందని, తపాల శాఖలో ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని తెలిపారు. రామచంద్రపురం తపాల కార్యాలయం పరిధిలో ఏరుపల్లి, ద్రాక్షారామ పరిధిలో వెలంపాలెం, మండపేట పట్టణం పరిధిలో గొల్లపేట కాలనీ ప్రాంతాలు ఫ్రాంచైజీలు ఏర్పాటుకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. సొంత ఖర్చులతో ఫ్రాంచైజీలు నడుపుకునే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపుగా రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం రాజమహేంద్రవరం డివిజన్ వారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు కొరకు అర్హులైన అభ్యర్థులు పైన తెలిపిన చిరునామాలో సంప్రదించాలని సూపరింటెండెంట్ కోమల్‌కుమార్ తెలిపారు.

రైతుల పురోగతికి సహకార సంఘాల కృషి


కోలంక పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

కాజులూరు: రైతుల పురోగతికి సహకార సంఘాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని కోలంక పీఏసీఎస్ చైర్మన్ వత్సవాయి రామకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ రామన్న అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో రామకృష్ణంరాజు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా కేవలం పంట రుణాలు మాత్రమే కాకుండా రైతుల భూమి అభివృద్ధికి, గృహనిర్మాణాలకు, వాహనాల కొనుగోలుకు రుణసదుపాయాలను అందిస్తున్నాయన్నారు. అనంతరం సంఘ సభ్యులు భూపతిరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు ముందస్తుగానే సహకార సంఘాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. దీర్ఘకాలిక రుణాలపై నోటీసులు జారీచేసి వసూళ్లను వేగవంతం చేయటం ద్వారా సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మేడిశెట్టి చంటి, నామ సూర్యనారాయణ, సాగి బొజ్జిరాజు, దంతులూరి కొండరాజు, చంద్రశేఖర్, సత్తిబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం మీదే


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

రాయవరం: ఒత్తిడిని అధిగ మిస్తే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు విజయాన్ని సొంతం చేసుకుంటారని ఎంఈవో వై.సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు శుక్రవారం పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం వి.శాంతిసునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటికే చదివిన విషయాలను, పరీక్షల్లో చక్కగా ప్రజంటేషన్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాజీ సర్పంచ్ కొండిపూడి సత్యప్రభ ఏసురత్నం వితరణతో విద్యార్థులు పరీక్షలు రాసుకునే ప్యాడ్స్, పెన్నులు అలాగే కొమ్ముల నాగేశ్వరరావు(వజ్రం) వితరణతో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఎనిమిదేళ్లుగా టెన్త్ విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ సత్యప్రభను ఎంఈవో సత్యనారాయణ అభినందించారు.

ధాన్యం కొనుగోలుకు ఆర్‌బీకేలు సిద్ధంగా ఉండాలి


ఆర్‌బీకే సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: దాళ్వా పంటకు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా సిబ్బంది సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. స్థానికంగా గల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తొలకరి ధాన్యం కొనుగోలు సమయంలో జరిగిన పొరపాట్లు ఇప్పుడు జరగకుండా చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు కొనుగోలు కేంద్రం సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు చేరవేస్తూ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన 21రోజుల గడువులోపు డబ్బులు జమా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఓ బలుసు రవి, ఆర్‌బీకే సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ


రోడ్లు, డ్రైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ ఆరిఫ్ తదితరులు

రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని సోమేశ్వరంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. సోమేశ్వరంలో రూ.6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిఫ్, ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, సోమేశ్వరం దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, సొసైటీ మాజీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆసీల పాటల ఖరారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పంచాయతీల్లో శుక్రవారం ఆసీలు పాటలు ఖరారు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, రాయుడు మోహన్‌లు విలేకరులకు తెలిపారు. ద్రాక్షారామకు సంబంధించి రోజువారీ మార్కెట్ ఆసీలు పాట రూ.9 లక్షలు హెచ్చు పాటకు కర్రా నాగేశ్వరరావు దక్కించుకోగా, వారపు సంత మార్కెట్ ఆసీలు పాట రూ.3,06,500లకు పెన్నాడ భీమశంకరరావు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, నున్న కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. వెల్లలో రోజువారీ మార్కెట్‌కు నిర్వహించిన ఆసీలు పాటలో అనిశెట్టి వీరబాబు రూ.47 వేలు హెచ్చుపాటకు దక్కించుకున్నారు.